
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
గురువారం 15 ఆగస్టు 2024





జెండా పండుగకు సర్వం సిద్ధం


మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

- వాడవాడలా ఏర్పాట్లు పూర్తి
- కలెక్టరేట్లలో జాతీయ జెండాలను ఎగరవేయనున్న స్పీకర్, ఎమ్మెల్సీ

మేడ్చల్(ఆంధ్రజ్యోతి)/ వికారాబాద్, ఆగస్టు 14 : వికారాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల్లో పంద్రాగస్టు వేడుకలు ఈసారి అట్టహాసంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టరేట్ల ఆవరణలో వేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే కలెక్టర్లు ప్రతీక్‌జైన్, గౌతమ్ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మేడ్చల్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాలను ఎగరవేసి ప్రసంగించనున్నారు. ఆహూతులను ఆకట్టుకునేలా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పంద్రాగస్టు సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించనున్నారు. మహిళా సంఘాలకు రుణాలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా ఈసారి స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వాడవాడలా జాతీయ జెండాల ఎగరవేతకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు.


చిట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో జెండా పండుగకు ముస్తాబు చేస్తున్న విద్యార్థులు


విద్యుత్ వెలుగుల్లో వికారాబాద్ కలెక్టరేట్


అప్పాయిపల్లి శివారులో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

మార్గం సుగమం!

- అప్పాయిపల్లిలో మెడికల్, పశువైద్య కళాశాలల ఏర్పాటుకు భూ సేకరణ పూర్తి
- రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్న అధికారులు
- 60 ఎకరాల్లో కళాశాలల ఏర్పాటుకు ప్రణాళికలు
- సీఎం చొరవతో త్వరలో పనులు ప్రారంభం

కొడంగల్ శివారులో మెడికల్, పశువైద్య కళాశాలల ఏర్పాటుకు భూ సేకరణ పూర్తయింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కలెక్టర్, ఉన్నత స్థాయి అధికారులు సర్వే నెం19లో గల రైతులతో చర్చించి వారి నుంచి అంగీకార పత్రాలను రాత పూర్వకంగా తీసుకున్నారు.

కొడంగల్, ఆగస్టు 14: కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులోని సర్వే నెం.19లో గల ప్రభుత్వ అసైన్డ్ భూమికి సంబంధించిన 45 మంది రైతుల నుంచి మెడికల్, పశువైద్య కళాశాలల ఏర్పాటుకు భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. 45 మంది రైతుల నుంచి సేకరించిన 60 ఎకరాల భూమిలో 20 ఎకరాలు మెడికల్ కళాశాలకు, 40 ఎకరాలు పశువైద్య కళాశాలకు కేటాయించడం జరిగిందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. అందులో భాగంగా భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.10 లక్షలు, 125 గజాల ఇంటి స్థలం, అర్హతను బట్టి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు అధికారులు ప్రకటించారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు భూములు ఇవ్వడంలో మొదట్లో ఒప్పుకోని రైతులు చివరికి అంగీకారం తెలపడంతో కళాశాలల ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని చెప్పవచ్చును. భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న రైతులతో మాట్లాడి సర్వే ఆధారంగా హద్దులను ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు భూములు ఇచ్చే రైతులు వారి పొలాల హద్దులను అధికారులకు చూపించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

60 ఎకరాల్లో కళాశాలలు

వెనకబడిన కొడంగల్ ప్రాంత అభివృద్ధి చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు అధికారులతో రివ్యూ సమావేశాలు నిర్వహించారు. అందులో భాగంగా అభివృద్ధి పనులకు అవసరపడే నిధులను సైతం మంజూర్‌తో పరిపాలన అనుమతులు ఇచ్చారు. అప్పాయిపల్లి శివారులోని 19 సర్వే నెంబర్‌లో అసైన్డ్ భూముల 45 మంది రైతులకు గతంలో కేటాయించారు. మెడికల్ కళాశాల కొడంగల్, తాండూర్ మధ్యలో ఏర్పాటుకు అనుకూలంగా ఉండటంతో సర్వే నెం.19లో కళాశాల నిర్మాణానికి నిర్ణయించారు. కళాశాలల ఏర్పాటులో అడ్డంకుల తొలగింపుకు అధికారుల ప్రయత్నాలు ఫలించాయని చెప్పవచ్చును.

అభివృద్ధికి సహకరించాలి



కొడంగల్ ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలి. కొడంగల్ మండలం అప్పాయిపల్లి శివారులో గల సర్వే నెం.19లో భూ నిర్వాసిత రైతులకు తగిన న్యాయం జరుగుతుంది. సర్వేనెం.19లో గల రైతులు సహకరించి కళాశాలల ఏర్పాటుకు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం శుభపరిణామంగా భావిస్తున్నాం.

- వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి

ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి



అభివృద్ధిలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పాయిపల్లి గ్రామ శివారులో గల సర్వే నెం.19లో మెడికల్, పశువైద్య కళాశాలలతో కొడంగల్ ప్రాంతం అభివృద్ధి జరుగుతుంది. ఎన్నో ఏళ్లుగా వెనకబాటుకు గురవుతున్న కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అన్నీ విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కొడంగల్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలి.

తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి


పూజలో పాల్గొన్న శైలజారామ్ అయ్యర్

రామలింగేశ్వరుడి సేవలో దేవాదాయ ముఖ్య కార్యదర్శి

- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శైలజారామ్ అయ్యర్

కీసర, ఆగస్టు 14: కీసరగుట్టను రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామ్ అయ్యర్ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత్‌రావుతో కలిసి బుధవారం సందర్శించారు. రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై ఆమె సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆలయ ఆదాయం, ఖర్చుపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతియేటా మహాశివరాత్రిని పురస్కరించుకొని జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తుల రాక, ఏర్పాట్లు, మౌలిక వసతులు, పార్కింగ్ విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తామర కొలను, కీసరవాణీవద్ద ఎగ్జిబిషన్ మైదానం, టూరిజం హోటల్ పరిసరా ప్రాంతాలను సంబంధిత అధికారులతో ఆమె కలియతిరిగారు. ఈ మేరకు ఆలయానికి సంబంధించిన సమస్యలపై ఆలయ నిర్వాహకులు ఆమెకు విన్నవించారు. ప్రస్తుతం ఆలయ పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు. ముందుగా ఆమె గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అర్చకులు మహా మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదములు, శేష వస్త్రములు, ఆశీర్వచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ సభ్యులు నారాయణ శర్మ, వెంకటేషశర్మ, శ్రీనివాస్‌శర్మ, కీసర మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ, ఆలయ ప్రదాన అర్చకులు బలరాం శర్మ, ఉపప్రధాన అర్చకులు రవి మోత్కూరు, సత్యనారాయణ శర్మ, రమేష్‌శర్మ, సాయి, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

- కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్/బొంరాస్‌పేట్, ఆగస్టు 14: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి కలెక్టర్ కొడంగల్ మండలంలోని చిట్లపల్లి, టేకుల్‌కోడ్, హస్సేన్‌పూర్ గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించిదన్నారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అనంతరం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో రూ. 70లక్షలతో నిర్మించనున్న ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. అంతేకాకుండాబొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్, లింగన్‌పల్లి గ్రామాల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్ నూతన పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఆయాకార్యక్రమాల్లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, ఎంపీడీవో ఉషశ్రీ, అంజనేయులు, మురళీధర్, నాయకులు ప్రశాంత్, నయీం, శివకుమార్ గుప్తా, బాస్కర్, ఆసిఫ్‌ఖాన్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఎంపీడీవో వెంకన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


టేకుల్‌కోడ్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, తిరుపతిరెడ్డి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

వికారాబాద్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం చీఫ్ సెక్రటరీ శాంతకుమారి జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట స్పెషల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. రాపిడ్‌కిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఇంటింటి జ్వరసర్వే నిర్వహించి పాజిటివ్ కేసులు ఉంటే వెంటనే వైద్యం అందించాలన్నారు. ఆయిల్ బాల్స్ వేయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం!

- పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలకు కసరత్తు షురూ

మేడ్చల్ ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడంతో పంచాయతీతో పాటు ప్రాదేశిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కొంత మంది సిబ్బంది శిక్షణకు వెళ్లి వచ్చారు. మరోవైపు ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించిన శిక్షణ కరపత్రాలు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరాయి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఇటీవల జరుగడంతో ఓటర్ల జాబితాలతో పాటు పోలింగ్ కేంద్రాల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 61 గ్రామ పంచాయతీలుండగా వీటి పదవీకాలం ఫిబ్రవరి ఒకటితో ముగియగా రెండో తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. జూలై నాలుగో తేదీ నుంచి జిల్లాపరిషత్తు, మండల పరిషత్తు పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, కేంద్రాలు, ఓటర్ల జాబితా, బ్యాలెట్ బాక్సులు, ఇప్పటి వరకు అమలు చేసిన రిజర్వేషన్ల వివరాలు తదితర వాటి సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు వచ్చిన ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉండాలి, సిబ్బంది ఎందరుండాలి, నామినేషన్ల స్వీకరణకు చెల్లించాల్సిన రుసుం, తదితర వాటిని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలతో రూపొందించిన కరపత్రాలను ప్రభుత్వం జిల్లా పరిషత్తుకు పంపించింది.

కార్యదర్శులు, ఎండీవోలకు శిక్షణ

గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా తయారీకిగాను జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లాలోని ఎండీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా తయారికీ అవసరమైన శిక్షణ ఇచ్చారు.


కార్యదర్శులు, ఎండీవోలకు శిక్షణ ఇస్తున్న డీపీవో వెంకయ్య, సాంబిరెడ్డి

ఓటర్ల జాబితా తయారుకు సిద్ధమౌతున్న సిబ్బంది

త్వరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలోపంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు మొదలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల జాబితా సిద్ధంగా ఉన్నా ప్రస్తుతం వార్డుల వారీగా, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించే పనిలో పడ్డారు. జిల్లాలో 15 మండలాలుండగా, ఐదు రూరల్ మండలాలు మేడ్చల్, మూడుచింతలపల్లి, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట మండలాలలో 61పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. అయితే జిల్లాకు సంబంధించి 23 గ్రామాలు గ్రేటర్‌లో విలీనమయ్యే ప్రచారం జరుగుతుండటంతో జిల్లాలో ఎన్ని పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయన్న విషయంలో అధికారుల నుంచి ఎటువంటి స్పష్టత లేదు. ప్రభుత్వాదేశాల ప్రకారం తాము పంచాయతీ ఎన్నికలకు సిద్ధమౌతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. దీనితో అన్ని గ్రామాలకు ఓటర్ల జాబితాను రూపొందించే పనిలో పడ్డారు.

లైంగికదాడి ఘటనపై విచారణ

బొంరాస్‌పేట్, ఆగస్టు 14: బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన అంధ బాలికపై లైంగికదాడి ఘటన కలకలం రేపింది. బాలిక హైదరాబాద్ లోని అంధుల పాఠశాలలో ఉంటోంది. గత నెల 6న పాఠశాలలో పారిశుధ్య పనులు నిర్వహించే యువకుడు బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు తేలింది. ఈ సంఘటనపై శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందించడంతో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం బాలిక కుటుంబీకులను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ క్రాంతి, డీడబ్ల్యూవో వెన్సీ కలిసి మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిరక్షణ కోసం అధికారులు రూ.25వేలు అందజేశారు.

ఘట్‌కేసర్ ఆస్పత్రిలో కొద్దిసేపు వైద్య సేవలకు అంతరాయం

ఘట్‌కేసర్, ఆగస్టు 14 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో కొద్దిసేపు వైద్యసేవలను నిలిపివేసి వైద్యులు నిరసన తెలిపారు. ఆస్పత్రిలో అంతా నిశ్శబ్దంగా ఉండడంతో ఏమైందని రోగులు, వారి అటెండెంట్లు కొనుక్కున్నారు. పేషెంట్లు ఓపీ చిట్టీల కోసం వేచి ఉన్నారు. 20నిముషాల్లో ఓపీ తిరిగి ప్రారంభమైంది. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని హత్యచేశారని, ఈ ఘటనకు నిసరనగా కొద్దిపేవు వైద్యసేవలు నిలిపివేశామని వైద్య సిబ్బంది తెలిపారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

పరిశ్రమ ఎదుట తండావాసుల ధర్నా • మద్దతు తెలిపిన పార్టీల నాయకులు



ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ గేటు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తండా వాసులు

నందిగామ, ఆగస్టు 14: పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని తండా వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల పరిధిలోని బండకుంట తండా సమీపంలోని ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ గేటు ఎదుట బుధవారం తండావాసులతో పాటు స్థానిక యువకులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. స్థానికులకు కాకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. చుట్టుపక్కల తండాల వారికి కొంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించిన పరిశ్రమ యాజమాన్యం కావాలనే వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని, ఎలాంటి కారణం లేకుండానే విధుల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలో ఎలాంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, గిరిజనులపై పరిశ్రమ యాజమాన్యానికి చిన్నచూపు ఎందుకని మండిపడ్డారు. స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని, తండాలలో కనీస వసతులు కల్పించాలని, కాంట్రాక్ట్ బేస్డ్ కాకుండా పరిశ్రమ తరఫున పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు వివిధ పార్టీల నాయకులు జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, సుమన్, అంజయ్య ఇతర నాయకులు మద్దతు తెలిపారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చాలి



మాట్లాడుతున్న హరికిషన్ వేదాలంకార్

చౌదరిగూడ, ఆగస్టు 14: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి, సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య ప్రతినిధి సభ మంత్రి హరికిషన్ వేదాలంకార్ ఆర్య సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 45వ శ్రవణవేద ప్రచార సత్సంగం ముగింపు కార్యక్రమంలో భాగంగా చివరి యజుర్వేద పారాయణ మహాయజ్ఞం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సమాజంలో శాంతియుత సహజీవనము పెంపొందించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. లోక కల్యాణార్థం వాతావరణ శుద్ధి, సకాలంలో వర్షాలు, పాడి పంటలు, దేశ సమైక్యతకు వేదాలు, యజ్ఞములే మూలమని తెలిపారు. 45 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషమని అన్నారు. ఆర్యసమాజ్ పాలక వర్గాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో యజ్ఞ బ్రహ్మలు అరవిందశాస్త్రి, డాక్టర్ వసుధాశాస్త్రి, వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర సేవా ప్రముఖ్ శ్రీవాణి, సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బండారి రమేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మచ్చ సుధాకర్‌రావు, కోసేరి శ్రీనివాస్, ఆకారపు యాదగిరి, చిన్నయ్య, ఆకారపు నాగరాజు, రఘునందన్‌చారి, బస్వరాజ్, బీజేపీ నాయకులు బాబయ్య, భూపాలచారి, శివకుమార్, బాలబ్రహ్మచారి, ఆర్య సమాజ్ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్'పై దృష్టి సారించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా



మేడ్చల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కచ్చిత ప్రణాళికతో సర్వే చేయాలని, సకాలంలో పరిష్కరించేందుకు శిక్షణతో కూడిన సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌కు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో బృందాలుగా ఏర్పాటు చేసి మొబైల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చేలా కావాల్సిన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌కు పోయేదెట్లా?

- కొనసాగుతున్న ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు
- జంక్షన్ల మూసివేత.. ప్రజల ఇక్కట్లు



కొత్తూర్ అండర్‌పాస్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

కొత్తూర్, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తూ నిర్మాణ పనులు జరగడం శుభపరిణామమే అయినా.. మండల కేంద్రానికి వచ్చే ప్రధాన జంక్షన్లను మూసివేయడంతో ప్రజలు లబోదిబో మంటున్నారు. స్థానిక ప్రధాన రోడ్డు గోతులమయంగా మారడం, ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సంబంధిత శాఖ అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించి నాలుగు లేన్లుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేయించారు. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. పదిహేను రోజుల క్రితం పనులు చకచకా ప్రారంభమైనాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్మాణ పనులకు అడ్డంకులు ఎదురైతున్నాయనే ఉద్దేశ్యంతో గత మూడు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు ప్రధాన జంక్షన్లను బారికేడ్లతో మూసివేశారు. కొత్తూర్ వైజంక్షన్, అండర్‌పాస్, జేపీ దర్గా రోడ్డు జంక్షన్‌ను మూసివేశారు. కాగా, వైజంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో నెల రోజుల క్రితమే పోలీసులు బారికేడ్లతో జంక్షన్‌ను మూసివేసి అండర్‌పాస్ గుండా వాహనాలను తరలించారు. ఇప్పుడు రోడ్డు నిర్మాణం కారణంగా అండర్‌పాస్‌ను కూడా మూసివేయడంతో సమస్య తీవ్రమైంది. దాంతో హైదరాబాద్ నుంచి కొత్తూర్ మీదుగా షాద్‌నగర్ వచ్చే ఆర్టీసీ బస్సులతో పాటు, ఇతర వాహనాలు బైపాస్ రోడ్డు ద్వారా వెళ్తున్నాయి. ప్రయాణికులు బైపాస్ వద్ద దిగి కొత్తూర్ టౌన్‌లోకి కాలినడకన రావాల్సి వస్తోంది. అలాగే జేపీ దర్గాకు వెళ్లే ప్రయాణికులు బైపాస్‌కు వెళ్లాల్సి వస్తుంది. కొత్తూర్ టౌన్ నుంచి బైపాస్‌కు వెళ్లే వాహనాలు తిమ్మాపూర్‌నకు వెళ్లి యూటర్న్ చేసుకుని రావాల్సి వస్తుంది. దాంతో రానుపోను 5 కిలో మీటర్లు ఎక్కువ దూరం వెళ్లక తప్పడం లేదు. జంక్షన్ల మూసివేతతో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆసుపత్రులకు వెళ్లేవారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంబులెన్సులకు సైతం సమయం వృథా అవుతోంది. ముఖ్యంగా కొత్తూర్ పారిశ్రామిక ప్రాంతం కావడంతో నిత్యం వందలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. కొత్తూర్ సమీపంలో ఐవోసీఎల్ ప్లాంట్ ఉండడంతో భారీ వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. ముఖ్యంగా అండర్‌పాస్ మూసి వేయడంతో భారీ వాహనచోదకులు కిలోమీటర్ల మేర బైపాస్ రహదారిలో వెళ్లి గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జంక్షన్ల మూసివేత అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణాన్ని ఒక వైపు పూర్తి చేసి, మరో వైపు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తూర్-జేపీ దర్గా రోడ్డును బారికేడ్లతో మూసివేసిన పోలీసులు

మహేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో సకల సౌకర్యాలు

- 50 పడకలకు హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతాం
- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కేఎల్లార్

మహేశ్వరం, ఆగస్టు 14 : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సకల సౌఖ్యాలు కల్పించి మరో రెండు నెలల్లో 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది జిల్లాలోనే ఆదర్శ ఆసుపత్రిగా తీర్చిదిద్దనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) తెలిపారు. బుధవారం మహేశ్వరంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఆయన ఆసుపత్రిలో సమస్యల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, పరికరాలు, వాటర్ ప్లాంట్, రోగులకు నిత్యం అందుబాటులో ఉండేలా ప్రైవేటు అంబులెన్స్ సౌకర్యం, పోస్టుమార్టం కేంద్రం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయని వైద్యులు ఆయన దృష్టికి తెచ్చారు. తమ ట్రస్టుతో పాటు అమెజాన్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను మరో 60 రోజుల్లో పరిష్కరిస్తానని తెలిపారు. అదేవిధంగా మండలంలోని విచ్చలవిడిగా చెలామని అవుతున్న ఆర్ఎంపీల ఆగడాలను అరికట్టాలని మహేశ్వరం నాయకులు కొందరు కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్ఎంపీల ఆగడాలను అరికట్టే యత్నం చేస్తానన్నారు. ప్రజలందరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. చిన్న సమస్యలకు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే.. రూ.వేలు, లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, కూన యాదయ్య, విఠల్‌నాయక్, కృష్ణానాయక్, రాఘవేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇస్రాయేలు, రాజునాయక్, శివ, అంద్యానాయక్, డి.శ్రీనివాస్‌రెడ్డి, అల్లె కుమార్, జంగయ్య, మురళీధర్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

కొర్విచెడ్‌ఘని పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

- వండిపెట్టే మహిళ ఇంట్లో టీబీ పేషెంట్ ఉన్నాడంటున్న గ్రామస్తులు
- ఇంటి భోజనమే పంపిస్తున్న వైనం
- ఆరా తీసిన ఎంపీడీవో



కొర్విచెడ్ పాఠశాలలో విచారణ జరుపుతున్న ఎంపీడీవో యాదయ్య

బషీరాబద్, ఆగస్టు 14: మండలంలోని కొర్విచెడ్‌ఘని పాఠశాలలో 14 రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడంలేదు. బుధవారం పాఠశాలలో పనుల పరిశీలనకు వచ్చిన ఎంపీడీవోకు మధ్యాహ్న భోజనంపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో హెచ్ఎం నాగరాజ్, మరో ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు. 63 మంది విద్యార్థులున్నారు. అయితే మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీ మహిళ కుటుంబంలో ఒకరికి టీబీ పాజిటివ్ వచ్చిందని, ఆ మహిళ వండితే తమ పిల్లలు తినరని తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. పిల్లల ఆరోగ్యం దృష్ట్యానే ఇలా అంటున్నామని వారు చెప్పినట్లు తెలిసింది. స్కూల్లో వండిన అన్నం తినొద్దని పిల్లలకు టిఫిన్ బాక్సు లు ఇస్తున్నా రు. కొందరు విద్యార్థులు మధ్యాహ్నం అన్నా నికి ఇళ్లకు వెళ్తున్నారు. కొందరు కార్మికుల పిల్లలు పస్తులుంటున్నారు. ఈ విషయమై స్కూల్ ఎచ్ఎం క్లస్టర్ హెచ్ఎం, ఎంఈవోల దృష్టికి తీసుకెళ్లలేదు. అప్పుడే విషయం తెలియడంతో ఎంపీడీవో యాదయ్య ఎచ్ఎం నిర్లక్ష్యంపై నిలదీశారు. ఈ విషయమై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, తల్లిదండ్రులతో సమావేశం పెట్టానని హెచ్ఎం తెలిపారు. దీనిపై ఏం చేద్దామని తల్లిదండ్రులను ఎంపీడీవో అడిగారు. వేరే మహిళతో వండించాలని వారు కోరారు. దీనిపై క్లస్టర్ హెచ్ఎం పార్వతీదేవి, ఎంఈవో సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. పాఠశాలలో భోజనం తినడంలేదని హెచ్ఎం తమ దృష్టికి తేలేదన్నారు. ఎంపీడీవో విచారణ సమయంలో నవాంద్గీ ప్యాక్స్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు హన్మంతు, లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

విత్తన జెండాలు భళా!

కూరగాయల విత్తనాలు, ఆవు పేడతో జాతీయ జెండాలు, రాఖీల తయారీ



విత్తనాలు, ఆవుపేడతో తయారు చేసిన జాతీయజెండాలు, రాఖీలు

తాండూరు, ఆగస్టు 14 : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దీర్ఘాయుష్ పూర్ణ సంస్థ స్వదేశీ విత్తనాలతో జాతీయ జెండాలను తయారు చేసింది. దేశభక్తి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగంగా స్వదేశీ కూరగాయల విత్తనాలు, ఆవుపేడతో జాతీయ జెండాలు, రాఖీలు తయారు చేయగా అవి ఆకట్టుకుంటున్నాయి. 'స్వదేశీ విత్తన జెండాలు భూమికి బహుమానాలు' అనే నినాదంతో వీటి రూపొందించామని అర్గనైజర్, తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కె.విజయలక్ష్మి తెలిపారు. వినియోగానంతరం వీటిని నేలలో పడేస్తే ఎరువుగా మారుతుందన్నారు. వీటిని పెరట్లో వేస్తే విత్తనాలు మొలకెత్తి అర్గానిక్ కూరగాయలను కూడా అందిస్తాయని తెలిపారు. విత్తన జెండాలు, రాఖీలు ధరించి ప్రకృతిని కాపాడుకుందామని ఆమె పిలుపునిచ్చారు.

అంతెత్తున తిరంగా

- తాండూరులో 30 మీటర్ల ఎత్తున జాతీయ జెండా
- నేడు ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే
- రూ.25లక్షల వ్యయంతో ఏర్పాటు



జాతీయ జెండా కోసం ఏర్పాటు చేసిన పోల్

తాండూరు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన గురువారం తాండూరు పట్టణంలో ఎత్తైన జాతీయ జెండా ఆవిష్కరణ జరగనుంది. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలోనూ ఏర్పాటు చేయని విధంగా తాండూరులో ఎత్తైన జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 30.5మీటర్లు(100 ఫీట్లు) ఎత్తున జాతీయ జెండాను 78వ స్వాతంత్ర్య దినోత్సవాన తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి ఆవిష్కరిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ తెలిపారు. రూ.25లక్షలతో ఈ జెండాను ఏర్పాటు చేశారు. జాతీయ జెండా పొడవు 35ఫీట్లు, వెడల్పు 25ఫీట్లు ఉంటుంది. రాత్రి వేళలలో జెండా జిగేల్ మనేలా పోల్‌కు 350వోల్టేజీ గల రెండు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా రెండు రాష్ట్రాల(తెలంగాణ, కర్ణాటక)కు కేంద్రంగా ఉన్న తాండూరులో ఎత్తైన జాతీయ జెండా ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జెండా ఆవిష్కరణకు ఎమ్మెల్యేతో పాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌లను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈ జెండాను, పోల్‌ను హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీ తయారు చేసింది. మున్సిపల్ ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో జెండా ఏర్పాట్లు జరిగాయి.

అంతారంలో అసైన్డ్ భూమి పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషన్ విక్రమ్‌కుమార్‌రెడ్డి

తాండూరు రూరల్, ఆగస్టు 14: మండల పరిధి అంతారంలో రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూమిని బుధవారం అధికారులు పరిశీలించారు. అంతారంలోని ఎస్టీఆర్ కాలనీకి ఆనుకుని ఉన్న భూమిని తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్వేయర్ మహేష్ పరిశీలించారు. ఈ భూమిలో తాండూరు, పెద్దేముల్, యాలాల మండలాల తర్కారి భూముల్లో 30ఎకరాలను మార్కెట్ కమిటీ నిర్మాణానికి కేటాయించారు. ఇదే భూమిలో గతంలో ప్రభుత్వం అరుగురు రైతులకు 9ఎకరాలను అసైన్ చేసింది. అందులో రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇదే భూమిలో మార్కెట్ కమిటీకి కేటాయించగా నిర్వాసిత రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు భూమిని పరిశీలించారు. భూమికి పట్టా పాస్‌బుక్కులు ఉన్నాయని రైతులు తెలిపారు. సర్వే చేసి రైతులు భూములు కోల్పోతే పరిహారం ఇప్పిస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

'ఉపాధి హామీ' బిల్లులు చెల్లించాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు, ఆగస్టు 14: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పది వారాలకు సంబంధించిన డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆధ్వర్యంలో కూలీలతో కలిసి ఎంపీవో లాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతీ వారం కూలీల డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని, ఎన్నికలు ముగిసి పది వారాలు గడిచినా డబ్బులు ఖాతాలో వేయకపోవడానికి కారణమేంటో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంఘం నాయకులు కృష్ణ, చంద్రయ్య, సురేష్, వెంటయ్య, కిష్టయ్య, రేణమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై గ్రామసభ



మందిపాల్‌లో గ్రామ సభ

కులకచర్ల, ఆగస్టు 14: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ఐదు రోజులుగా ఆడిట్ కొనసాగుతోంది. 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024వరకు జరిగిన పనులపై సోషల్ ఆడిట్ సభ్యులు తనిఖీ చేశారు. వివరాలను పీరంపల్లి, వీరాపూర్, మందిపాల్ గ్రామాల సభల్లో సోషల్ ఆడిట్ సభ్యులు వివరించారు. పనుల నాణ్యత, కూలీలకు డబ్బులు తదితర వివరాలు వెల్లడించారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కులకచర్ల, ఆగస్టు 14: బండవెల్కిచర్ల గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య బుధవారం తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 11, బైపీసీలో 2సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ సీట్ల భర్తీకి ఈ నెల 17 నుంచి 19 వరకు నేరుగా అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా హాజరు కావాలని తెలిపారు.

ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 14: దుద్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని అస్మిత, 9వ తరగతికి విద్యార్థిని సంగీత జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. స్వాతంత్ర్యోద్యమంలో జాతీయ నాయకుల పాత్ర అంశంపై ఉపన్యాసం, జాతీయ నాయకుల చిత్ర పటాల చిత్రలేఖనంలో పోటీలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారని హెచ్ఎం విజయరామారావు, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, ముకుంద రెడ్డి బుధవారం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈవో రేణుకాదేవిల నుంచి వీరు బహుమతి అందుకుంటారని చెప్పారు.

ప్రతీ ఇంటిపై.. తిరంగా జెండా ఎగరాలి



వికారాబాద్‌లో బీజేపీ నాయకుల తిరంగా ర్యాలీ

వికారాబాద్/ఘట్‌కేసర్ రూరల్/తాండూరు/మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్, ఆగస్టు 14: ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి అన్నారు. బుధవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్‌లో తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. ఆలంపల్లి చౌరస్తా నుంచి ప్రధాన చౌరస్తాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకి జై అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, శ్రీధర్‌రెడ్డి నరోత్తంరెడ్డి, పోకల సతీశ్,వివేకానందారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, అమర్, సాయి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్‌లో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఉద్యోగులందరు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉద్యోగులకు క్రీ డాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డీజీఎం అజయ్‌పాల్, సిబ్బంది నవీన్‌రెడ్డి, అయ్యప్ప, లోహిత్‌కుమార్ పాల్గొన్నారు. తాండూరులో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో బస్టాండు, శాంత్ మహల్‌చౌరస్తా, రైల్వే స్టేషన్, మార్వాడి బజార్, గాంధీచౌక్, గంజ్ మీదుగా ఇందిరా చౌక్‌కు చేరుకొని ర్యాలీ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీనగర్‌లో కౌన్సిలర్ సంగీత అజయ్‌సింగ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇంటింటికి జెండాలను పంపిణీ చేశారు. పట్టణ బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, హెచ్‌ఎం నాగదేవి, టీచర్లు సరిత, జగదీశ్వరి పాల్గొన్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండ్లపోచంపల్లిలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ సరస్వతి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మేడ్చల్‌లో జగన్‌గౌడ్, ఆంజనేయులు, ప్రేమ్‌దాస్ ర్యాలీని ప్రారంభించారు. స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మాట్లాడుతూ దేశ సుస్థిరతకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.



తాండూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న కౌన్సిలర్ సంగీత



గుండ్లపోచంపల్లిలో...

స్వాతంత్ర్య వేడుకలకు స్కూళ్లు, కార్యాలయాల ముస్తాబు



మూడు రంగుల లైట్ల వెలుగుల్లో తాండూరు మున్సిపల్ కార్యాలయం

కొడంగల్ రూరల్/మోమిన్‌పేట్/తాండూరు, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించే జెండా పండుగకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు ముస్తాబయ్యాయి. కొడంగల్ మండలం చిట్లపల్లి పాఠశాలలో విద్యార్థులు బుధవారం జెండా కాగితాలను అతికించి, పాఠశాల ఆవరణలో దేశ చిత్రపటాన్ని గీసి రంగులద్దారు. కొడంగల్ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను వేడుకలకు ముస్తాబు చేశారు. మోమిన్‌పేట్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాల యాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగరవేసేందుకు ముస్తాబు చేశారు. పూడూరు మండలం కడుమూరు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తరగతి గదులు, గోడలకు రంగురంగు కాగితాలు, పూలతో అలంకరించా రు. తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని జెండా రంగులతో కూడిన విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్ట్రీట్‌లైట్లను కూడ జెండా రంగుల తో వెలగించారు. ఇందిరాచౌక్ నుంచి విలియమూన్ చౌరస్తా వరకు జెండా రంగు లైట్లు వెలిగించారు.

వైకుంఠధామ నిర్మాణంపై వివాదం

కీసర రూరల్, ఆగస్టు 14 : దమ్మాయిగూడలో శ్మశానవాటిక నిర్మాణం వివాదంగా మారింది. ఇరు వర్గాల సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు రంగప్రవేశం చేసి, సర్ది చెప్పారు. దమ్మాయిగూడ గ్రామంగా ఉన్న సమయంలో మృతదేహాలకు నాసిన్‌చెరువు ఒడ్డున దహన సంస్కారాలు చేసేవారు. ఇప్పుడు ఊరు పట్టణంగా రూపాంతరం చెందింది. చెరువు సమీపంలో కాలనీలు ఏర్పడ్డాయి. ఇక్కడ శ్మశానవాటిక వద్దని సమీప కాలనీ వాసులు అభ్యంతరం చెబుతున్నారు. వేరేచోట్ల స్థలాన్ని సేకరించి వైకుంఠథామాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అయినా పనులు ముందుకు సాగడం లేదు. స్థల వివాదాలు, రోడ్ల సమస్యలతో వైకుంఠధామ నిర్మాణం కాలేదు. దీంతో స్థానికులు కొందరు చందాలు వేసుకుని నాసిన్ చెరువు వద్ద శ్మశాన వాటిక నిర్మాణానికి పనులు ప్రారంభించారు. దీనిపై కాలనీ వాసులు కోర్టు స్టే ఆర్డర్ తెచ్చారు. సర్వే నంబర్ 473లో శ్మశాన వాటిక ఉంటుందని, స్టేఆర్డర్ 437లో తెచ్చారని స్థానికులు వాదిస్తున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న జవహర్‌నగర్ పోలీసులు చేరుకొని ఇరువర్గాల వాదనలు విని అందరికీ సర్దిచెప్పి పంపించారు. రెండు రోజుల వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవొద్దని కాలనీ వాసులు గ్రామస్తులను, పోలీసులను కోరారు.

హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందించాలి

తాండూరు, ఆగస్టు 14: ప్రతి హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణతపై ఆరా తీశారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని వార్డెన్లకు సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, తహసీల్దార్ తారాసింగ్, వెంకటేష్, పెద్దేముల్ ఎంపీడీవో జర్నప్ప, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

జర్నలిస్టు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దోమ, ఆగస్టు 14 : దోమ మండలం బాసుపల్లికి చెందిన జర్నలిస్టు ఆంజనేయులు తల్లి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డి, పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు

కీసర, ఆగస్టు 14 : ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. చీర్యాల్ గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్య సాధన కోసం చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. మహిళలు, అమ్మాయిల రక్షణ కోసం షీటీమ్స్ విధులు నిర్వహిస్తున్నాయన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే 100కు డయల్ చేయాలన్నారు.



చింతామణి పట్నం పాఠశాలలో టై, బెల్టులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్తులు

పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

తాండూరు రూరల్, ఆగస్టు 14 : చింతామణిపట్నం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. బుధవారం హెచ్‌ఎం సోదరుడి కుమార్తె మన్విత వర్షిని జన్మదినం సందర్భంగా విద్యార్థులకు సొంత ఖర్చుతో రూ.4వేల విలువైన టై, బెల్టులను అందజేశారు. ఎచ్‌ఎం స్నేహితుడు బసవేశ్వర్ ఐడీ కార్డులను అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లలిత, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు చిత్తశుద్ధితో సేవలందించాలి



బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న తహసీల్దార్ యాదగిరి రెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 14: బదిలీపై వచ్చిన నూతన అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా ప్రజలకు సేవలందించాలని తహశీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐలు కుమార్, సుమలత, డీటీ ప్రసన్నలక్ష్మి బదిలీ అయ్యారు. కొత్త డీటీగా సంయుక్త, ఆర్ఐలుగా కవిత, రామవసాగర్ వచ్చారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బదిలీపై వచ్చిన నూతన అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి మెప్పు పొందాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

మోమిన్‌పేట్, ఆగస్టు 14: మొరంగపల్లి పంచాయతీ కార్యదర్శి మాధవి టేకులపల్లికి బదిలీ కావడంతో బుధవారం పంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లయ్య, నాయకులు మానేయ, వెంకటయ్య, గ్రామస్తులు సన్మానించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగి బదిలీపై ఎక్కడికి వెళ్లినా చేసిన సేవలు గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ధారూరు బంద్ ప్రశాంతం

ధారూరు/మర్పల్లి, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ బుధవారం ధారూరులో బీజేపీ, హిందూ సమాజం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. హనుమాన్ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రమేశ్, క్రిష్ణ, పరమేశ్, విశ్వనాథం, సాయిగౌడ్, నర్సింహులు పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా మర్పల్లిలో బంద్ నిర్వహించారు. మండల బీజేపీ నాయకులు, హిందు సంఘాల సభ్యులు బసవేశ్వర విగ్రహం నుంచి కింది బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో రోజురోజుకూ హిందువులపై దాడులు పెరుగుతున్నాయని, ఇది సరికాదన్నారు. ఆ దేశ పాలకులు హిందువులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లేశ్, మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు, సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మర్పల్లిలో బీజేపీ, హిందు సంఘాల ర్యాలీ

కొర్విచెడ్‌ఘని పాఠశాలలో నీటి సమస్యకు చెక్

బషీరాబాద్, ఆగస్టు 14: మండలంలోని కొర్విచెడ్‌ఘని పాఠశాలలో నీటి సమస్యకు చెక్ పడింది. బుధవారం గ్రామంలోని పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనుల పరిశీలించేందుకు ఎంపీడీవో గాలి యాదయ్య రాగా ఉపాధ్యాయులు నీటి సమస్య ఉందని తెలిపారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో మెకానిక్‌ను పిలిపించి గంటల వ్యవధిలో చేతి పంపును మరమ్మతు చేయించారు. దీంతో గ్రామస్తులు, టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

మైల్వార్ అక్కలమ్మ చెరువు ప్రధాన కాల్వ కొలతలు

బషీరాబాద్, ఆగస్టు 14: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాలతో మైల్వార్ అక్కలమ్మ చెరువు ప్రధాన కాల్వ మరమ్మతుకు అధికారులు బుధవారం కొలతలు తీశారు. ప్రధాన కాల్వ పూడికతో నిండిందని స్థానిక నాయకుడు సోంపల్లి బిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు మూడు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇరిగేషన్ అధికారులు ఎంత మేరకు కాల్వ మరమ్మతులు చేపట్టాలనే దానిపై కొలతలు తీశారు. 150మీటర్ల మేర మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నారు.

సంక్షిప్తంగా...

● **కీసర:** మండల కేంద్రం కీసర గ్రామానికి చెందిన సదా ఆంజనేయులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ మేరకు అతడి కుటుంబానికి కీసర మాజీ ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ రమేష్‌గుప్తా ఆర్థిక చేయూతనందించారు. బుధవారం 5వేల రూపాయాల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చినింగని సుధాకర్, కానుకుర్తి కృష్ణ, డీజీ సాయి పాల్గొన్నారు.

● **వికారాబాద్:** తన కొడుకు ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బాధితుని తండ్రి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. చెన్‌గోముల్‌కు చెందిన బందెయ్య అనే రైతు ఎకరన్నర పొలం ఉంది. గ్రామానికి చెందిన ఉమర్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, రిజ్వాన్ ఖాన్, సొహైల్‌ఖాన్, పయాజ్‌ఖాన్, సలీంఖాన్‌లు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారి ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం తమ పొలంలోకి వచ్చి పత్తిపంటపై గడ్డిమందు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మనస్థాపం చెందిన తన కొడుకు శ్రీకాంత్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడని బందెయ్య తెలిపారు. తమను ఇబ్బందులకు గురి చేస్తున్న వారి నుంచి తమకు ప్రాణ హాని ఉందని, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో కోరాడు.

● **ధారూరు:** మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు సన్మానిస్తామని మాజీ జడ్పీటీసీ సుజాత తెలిపారు. మండలంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరినీ శాలువాలు కప్పి, మెమొంటోలను అందజేస్తామన్నారు. ఆయా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులందరికి సన్మాన కార్యక్రమం ఉంటుందని ఆమె చెప్పారు.

● **శామీర్‌పేట:** మండలంలోని తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లి పరిధిలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం అన్నదానాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొంపల్లి వాసి బొమ్మడి శంకర్‌రెడ్డి-లక్ష్మి దంపలులు, అలాగే సూర్యకరణ్‌రెడ్డి-లావణ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు అదిత్యరెడ్డి, అద్విక్‌రెడ్డి అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

ఘట్‌కేసర్, ఆగస్టు14: మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనిజంగయ్య యాదవ్ అన్నారు. బుధవారం 18వ వార్డు ద్వారకనగర్‌లో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్త రోడ్లకు 20రోజులు నిత్యం నీళ్ల పోయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, ఏఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావని

నూతన ఎస్ఐని కలిసిన నాయకులు

నవాబుపేట, ఆగస్టు 14: నవాబుపేట నూతన ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి యం.యాదగిరి, దళితరత్న అవార్డీ శివరాజ్, పులుమామిడి నర్సింలు కలిశారు. బుధవారం స్టేషన్‌లో ఎస్సైని కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అలాగే నూతన ఎస్సై వికారాబాద్ డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నవాబుపేట మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

క్రైం కార్నర్

సింగిల్‌విండో చైర్మన్‌పై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 14 : ఓ సీనియర్ జర్నలిస్ట్‌పై దాడిచేసిన ఘట్‌కేసర్ రైతు సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రామిరెడ్డి, ఆయన అనుచరుడిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, జయపురి కాలనీ సర్వే నంబర్లు 559, 563లోని 2,136 గజాల స్థలాన్ని 2005లో నగరానికి చెందిన జర్నలిస్ట్ మామిడి సోమయ్య కొన్నారు. ఈ నెల 7న ఆయన తన ప్లాట్లను చదును చేస్తుండగా చైర్మన్ రామిరెడ్డి, అతడి అనుచరుడు గడీల సంజీవరెడ్డి ప్లాట్లను ఎందుకు చదునుచేస్తున్నావంటూ దుర్భాషలాడి దాడిచేశారు. సోమయ్య 100కు సమాచారం ఇవ్వగా పోలీసులు చేరుకొని వారిని అక్కడి నుంచి పంపించారు. తన ప్లాట్లలోకి ప్రవేశించి తనపై దాడిచేసిన రామిరెడ్డి, సంజీవరెడ్డిలపై సోమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావమరిది గొంతు కోసిన బావ



చికిత్స పొందుతున్న నరేందర్

పూడూరు, ఆగస్టు 14: కుటుంబ తగాదాపై పంచాయితీ పెట్టారన్న కోపంతో ఓ వ్యక్తి తన భార్య తమ్ముడి గొంతు కోశాడు. ఈ సంఘటన కడుమూరులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కడుమూరు గ్రామానికి చెందిన జొన్నాడ జంగయ్య, భార్య స్వప్న మంగళవారం గొడవ పడ్డారు. గొడవ విషయమై స్వప్న షాబాద్ మండలం నందర్‌ఖాన్‌పేట్‌లో ఉంటున్న తన పుట్టింటికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె తమ్ముడు బింగి నరేందర్ కడుమూరుకు వచ్చి తన అక్కతో గొడవపడుతున్నాడంటూ జంగయ్యపై గ్రామంలో పంచాయితీ పెట్టాడు. దీంతో నరేందర్‌పై జంగయ్య కోపం పెంచుకొని పంచాయతీ అనంతరం చాకుతో నరేందర్ గొంతు కోశాడు. గ్రామస్తులు అతడిని ఆసుపత్రికి తరలించారు. నరేందర్ కుటుంబీకులు చెన్‌గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని జంగయ్యను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

బాలికను వంచించిన యువకుడు

● పోలీసులను ఆశ్రయించిన బాధితురాలి తల్లి

బషీరాబాద్, ఆగస్టు 14 : ఓ యువకుడు బాలికను మాయమాటలతో నమ్మించి వెంట తీసుకెళ్లి మోసం చేశాడు. నెలల పాటు బాలికతో ఉండి నీవు నాకొద్దంటూ ఇంటికి పంపించేశాడు. చేసేదేమి లేక బాలిక తన తల్లితో కలిసి బుధవారం బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నీళ్లపల్లికి చెందిన యాకూబ్ 2023లో గ్రామానికే చెందిన బాలిక(17)కు మాయమాటలు చెప్పి వెంటతీసుకెళ్లాడు. అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో బాలికతల్లి ఫిర్యాదుతో మిస్సింగ్ నమోదైంది. మూడు నెలల పాటు వేరే ప్రాంతంలో ఉన్న వీరు ఇటీవల గ్రామానికి వచ్చారు. తనను ఇంటికి పంపించి యాకూబ్ పట్టించుకోవడం లేదని గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులూ పట్టించుకోకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని బాలిక, ఆమె తల్లి పోలీసులను వేడుకున్నారు. దీనిపై ఎస్ఐ రమేష్‌కుమార్ స్పందిస్తూ అప్పట్లో బాలిక అదృశ్యం కేసు నమోదైందన్నారు. ఇందుకు బాధ్యుడైన యవకుడిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని ఆయన వెల్లడించారు.

మేకల మృతిపై పశువైద్యాధికారి విచారణ



ట్రాక్‌పై పరిశీలిస్తున్న వైద్యాధికారి

ధారూరు, ఆగస్టు 14 : రెండు రైళ్లు ఢీకొని మేకలు మృతిచెందిన సంఘటనపై బుధవారం ధారూరు పశువైద్యాధికారి ఎస్.శ్వేత వివరాలు సేకరించారు. సంఘటన జరిగిన రైల్వే ట్రాక్ వద్ద పరిశీలించారు. రైళ్లు ఢీకొని మేకల మృతి చెందటంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధక అధికారి పూర్ణచందర్‌రావు ఆదేశాల మేరకు డీకే తండాలోని బాధితుల ఇళ్లకు వెళ్లి విచారించారు. పొదల నుంచి అడవి పందులు మేకల మందపైకి రావటంతో మేకలు బెదిరి రైల్వేట్రాక్‌పైకి పరుగెత్తాయని, ఇదే సమయంలో తాండూర్, వికారాబాద్ వైపు వెళ్తున్న రెండు రైళ్లు మేకలను ఢీకొట్టాయని తెలిపారు. 66 మేకలు మృతిచెందినట్లు ఆమె గుర్తించారు. మృతిచెందిన మేకలు డీకే తండాకు చెందిన కె.రమేశ్, చంద్రిబాయి, పూల్‌సింగ్, బాల్‌రాజ్, కిష్టిబాయి, హస్లీబాయిలవిగా గుర్తించామని, వీటి విలువ రూ5.5లక్షలు ఉంటుందన్నారు. నివేదికను జిల్లా అధికారికి అందజేస్తామని వైద్యాధికారి తెలిపారు.

తాండూరు పీఆర్ డీఈగా నాగభూణం



తాండూరు రూరల్, ఆగస్టు 14 : తాండూరు, పెద్దేముల్ మండలాలకు పంచాయతీ రాజ్ డీఈగా నాగభూషణం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వెంకట్‌రావు రిటైర్ కావడంతో ఆయన స్థానంలో జనగాం జిల్లాలో పనిచేస్తున్న నాగభూషణం తాండూరు డీఈగా వచ్చారు. బుధవారం డీఈఈ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

లింగాపూర్‌ను సందర్శించిన 'లయోలా' విద్యార్థులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 14: గ్రామీణ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో బుధవారం ను చిత్ర లయోలా అకాడమీ బీఎస్సీ విద్యార్థులు లింగాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కళాశాల వారు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, ఇతర బహుమతులు అందజేశారు.